ప్రజాశక్తి

సోమవారం 16 అక్టోబర్ 2023   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సినీఫక్కీలో భార్య హత్య

- ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేసిన భర్త
- హత్య కేసు నమోదు



కోటేశ్వరి మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం, కోటేశ్వరి (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కుటుంబకలహాల నేపథ్యంలో భార్యను సినీఫక్కిలో చంపిన భర్త.. ఆపై దానిని ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసు విచారణలో తానే చంపినట్లు నిందితుడు అంగీకరించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు భర్తపై పుల్లలచెరువు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

పుల్లలచెరువు మండలం, సిద్ధనపాలెంకు చెందిన కోటేశ్వరికి, ఏడు సంవత్సరాల క్రితం పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రామాపురానికి చెందిన పూజల శ్రీనుతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల శ్రీను, కోటేశ్వరి మధ్య కలహాలు రావటంతో కోటేశ్వరిని హత్య చేయాలని శ్రీను ప్లాన్ వేశాడు. పుల్లలచెరువు మండలంలోని మానేపల్లి సమీపంలో గల నాగార్జునసాగర్ కాలువ కట్టపై నుంచి భార్య కోటేశ్వరితో కలిసి శనివారం బైక్‌పై వెళుతున్నాడు. ఒక్కసారిగా బైక్‌ను కాలువలోకి తీసుకెళ్ళాడు. దీంతో నీటి ప్రవాహంలో బైక్‌తో పాటు కోటేశ్వరి గల్లంతైంది. కాపాడుకొనే క్రమంలో భర్తను గట్టిగా పట్టుకోగా.. ఆమెను విదిల్చి.. ఈదుకుంటూ శ్రీను బయటకు వచ్చాడు. ఆ తరువాత ఏమీ ఎరుగనట్టు తన బంధువులతో పాటు భార్య బంధువులకు ఫోన్ చేసి ప్రమాదవశాత్తూ కాలువలో పడటం వల్ల భార్య, బైక్ కొట్టుకొని పోయినట్లు చెప్పాడు. ఘటనాస్థలానికి ▶ 2లో

సాగు నీరందక

అన్నదాతల అగచాట్లు

- వరి పంటను కాపాడుకునేందుకు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీళ్లు..
- జలవనరుల కార్యాలయాలను ముట్టడిస్తున్న రైతులు



ఆయిల్ ఇంజన్లతో పొలాలకు నీరిందిస్తున్న రైతులు



నీరు లేక పొడి బారిన మాగాణి భూములు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా రైతులను వర్షాభావ పరిస్థితులు ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. వర్షాలు పడతాయి.. పంట కాలువల ద్వారా మాగాణి పొలాలకు సాగునీరందుతుందని వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సాగు నీరందక దాదాపు 60 వేల ఎకరాల్లోని వరి పైరు పరిస్థితి ప్రశ్నార్థకమయింది. ఆగస్టులో వర్షాలు పడటంతో జలాశయాలు నిండుతాయి. పంటకాలువకు నీరు వస్తుందని భావించిన రైతులు వరినార్లు పోసి నాట్లు వేశారు. కానీ వరి పైరు 40 రోజులకు చేరినా ముఖ్యమైన పొట్ట దశలో కాలువల ద్వారా నీటి సరఫరా తగ్గిపోయింది. దీంతో కాలువ చివరి భూములకు సాగు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. జలాశయాల్లో నీరు ▶ 2లో



ఒంగోలులో దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో చేతులకు సంకెళ్లతో నిరసన

సంకెళ్లతో నిరసన

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చేతులకు సంకెళ్లతో నిరసన తెలియజేశారు. ఒంగోలు, గిద్దలూరు, వై.పాలెం తదితర చోట్ల నిరసనలు తెలిపారు.



ఎఫ్ఎల్‌సి ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పకడ్బందీగా ఎఫ్ఎల్‌సి ప్రక్రియ

- నేటి నుంచి నవంబర్ 10 వరకు కార్యక్రమ నిర్వహణ
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

▶ 2లో

వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి..

మాగుంట కుటుంబం నుంచే..

- మాగుంట జన్మదిన వేడుకల్లో బాలినేని ప్రకటన
- వ్యూహాత్మకంగానే ప్రకటించిన మాజీ మంత్రి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పక్కనే బాలినేని, కరణం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాగుంట..బాలినేని బంధం మరింత బలపడింది. ఇద్దరి మధ్య రాజకీయ ఐక్యత పెరిగింది. మాగుంటకు అన్ని విధాలా అండదండలు అందించి తన నాయకత్వ పటిమను చాటుకోవడంలో బాలినేని ఇటీవల వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారనే చర్చ పాలకపక్షంలో సాగుతోంది. గతంలోనే ఆయన ఈ ప్రకటన చేశారు. ఇప్పుడు సందర్భంగానూ చేయడం చర్చగా మారింది. మాగుంట జన్మదిన వేడుకలు ఆదివారం నాడు ఘనంగా జరిగాయి. ఎన్నడూ లేని విధంగా ఈ వేడుకలు ఈ సారి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాజకీయ ప్రాధాన్యత ప్రాబల్యం కనిపించింది. మాగుంట అనుచరులతో పాటు జిల్లాలోని ముఖ్యనేతలు అందరూ హాజరై మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా నేతలు అందరూ హాజరై ఆయనకు శుభాకాంక్షలు చెప్పే నేపథ్యంలో బాలినేని చేసిన కొద్దిపాటి ప్రసంగం అంతా రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. మాగుంట ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే కామ్‌గా ఉండిపోతారంటూ.. కార్యకర్తల కోసం మనం కూడా గట్టిగానే నిలబడాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా మాగుంట కుటుంబం నుంచే పోటీచేస్తారని ప్రకటించారు. ఆయన కోరిన ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని పోటీ చేయించాలన్నదే నన్నారు. ఆయన పోటీ చేస్తారా? లేక ఆయన కుమారుడా? అనేదీ నిర్ణయించుకుంటారన్నారు. బాలినేని ఈ ప్రకటన చేయడానికి కూడా బలమైన కారణం ఉంది. ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి ప్రయత్నాల్లో ఉన్నారు. సిఎం జగన్ ▶ 2లో

వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట కుటుంబం నుంచే..

(మొదటిపేజీ తరువాయి)

వద్ద తన అభిప్రాయాన్ని పెట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. దీనిపై ఇటీవల పార్టీలోనూ పెద్ద దుమారం రేగుతోంది. గతంలో ప్రజాశక్తిలో వచ్చిన కథనంపైనే బాలినేని స్పందించి మాగుంటే పోటీ చేస్తారని ప్రకటించారు. ఇక జిల్లా కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి నియమితులయ్యాక బాలినేనికి ప్రాధాన్యత పెరిగింది.జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెండు రోజుల సమీక్ష అనంతరం బాలినేనికి జిల్లా పగ్గాలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో ఏ నిర్ణయమైనా బాలినేని పార్టీ నేతలతో చర్చించి తీసు కుంటారని ఆయన ప్రకటించి వెళ్లారు. అదే సమయంలోనే బాలినేని ఇక్కడ అభ్యర్థులపై విజయసాయిరెడ్డితో చర్చించి ఓ స్పష్టతకు వచ్చారు. ముఖ్యంగా ఒంగోలు ఎంపీ అభ్యర్థిపై సాగుతోన్న సందిగ్ధంపైనా చర్చ నడిచిందని సమాచారం. ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డికే తిరిగి పోటీచేసే అవకాశం కల్పించాలని బాలినేని గట్టిగా కోరారని సమాచారం. వైవీ కుమారుడికి టిక్కెట్టు ఆలోచిస్తే అంగీకరించబోమని కూడా స్పష్టం చేశారని వినికిడి. దీనికి విజయసాయిరెడ్డి కూడా స్పష్టంగానే అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బాలినేని ఒంగోలు పార్లమెంటుకు మాగుంట కుటుంబం నుంచే పోటీచేస్తారని స్పష్టంగా చెబుతున్నారు. గతంలోనూ ఒంగోలు అసెంబ్లీకి తాను, పార్లమెంటుకు మాగుంట పోటీ చేస్తారని ఓ వేదికలో ప్రకటించారు. ఇప్పుడు మాగుంట పుట్టిన రోజు వేడుకల్లోనూ మరోసారి ఇదే విషయాన్ని ఆయన ప్రకటించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక మాగుంట కూడా బాలినేనికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ ఇద్దరూ ఇప్పటివరకూ ఒకేపార్టీలో పోటీచేస్తేనే ఫలితం సానుకూలంగా ఉంటుందని గుర్తించారు. అలా కాకుండా ఇద్దరూ విడివిడిగా అంటే చెరో పార్టీ నుంచి పోటీ చేసినందున ఇద్దరూ చెరోసారి నష్టపోయారు. ఈ అనుభవాలను గుర్తుంచుకునే గట్టి నిర్ణయం తీసుకున్నారని రాజకీయ విశ్లేషణ. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో ఇద్దరూ వైసిపి నుంచీ ఒంగోలు అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీచేయాలనే నిర్ణయంలో గట్టిగానే ఉన్నారు.

అట్టహాసంగా మాగుంట జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక రాంనగర్ రెండో లైన్‌లోని మాగుంట కార్యాయంలో కుమారుడు మాగుంట ప్రణీత్‌రెడ్డి, నిఖిల్‌బాబు, అభిమానులు మధ్య ఏర్పాటుచేసిన భారీ బర్తడే కేక్‌ను మాగుంట శ్రీనివాసులురెడ్డి కట్ చేశారు. మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, మార్కాపురం శాసనసభ్యులు కుందుర్రు నాగార్జున రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు, మాజీ శాసనసభ్యులు డేవిడ్‌రాజు, సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు మాగుంటకు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం ఏఎంసీ శ్రీనివాస రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యులు శిద్దా సుధీర్ కుమార్, కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, వైసీపి నాయకులు మాదాసి వెంకయ్య, అద్దంకి వైసిపి ఇన్‌చార్జి బాచిన కష్ణ చైతన్య, ఒంగోలు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, అయినాబత్తిని ఘనశ్యామ్, విన్నకోట శ్రీనివాసరావు ఉన్నారు.

హుండీల వద్ద నిఘా ఏర్పాటు చేయాలి

సిఎస్.పురం : మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలోని హుండీల వద్ద ప్రతేక నిఘా ఏర్పాటు చేయాలని కోవిలాంపాడు సర్పంచి షేక్ ఖాదరబీబుజ్జి దేవస్థానం ఇఒ రమణారెడ్డిని కోరారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరు గాంచిన ఆలయంలో అక్కడే పని చేస్తున్న పూజారి హుండీల్లోని నగదు చోరీ చేయడం దురదష్టకరమన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రతేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోను చంద్రశేఖరరెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఆత్మ పీడీ కె. అన్నపూర్ణమ్మ

ప్రజాశక్తి-కొత్తపట్నం

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆత్మపీడీ కె. అన్నపూర్ణమ్మ తెలిపారు. స్థానిక డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో జాతీయ మహిళా కిసాన్ దివాస్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ మహిళలు వ్యవసాయ రంగంలో చేస్తున్న కషి వెలకట్టలేనిదని తెలిపారు. సంపదలో సష్టించటం మహిళలే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ రవికుమార్ మాట్లాడుతూ మహిళలు డిఆర్‌డిఎ, వెలుగు శాఖల ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు ఆర్గానిక్ వ్యవసాయం సాగు చేయాలన్నారు. పెరటి తోటల్లో ఆకుకూరలు, కూరగాయలను పండించి అధిక లాభం పొందాలన్నారు. వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ ఆళ్ల రవీంద్రర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తునర్నట్లు తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా, సామాజికంగా ముందుండాలన్నారు. ప్రతి ఒక్కరూ భోజనానికి



మాట్లాడుతునత్న ఆత్మపీడీ అన్నపూర్ణమ్మ

ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ సుజాత, జిల్లా వనరుల కేంద్రం ఎఒ వీరగంధం వెంకట శేషమ్మ, మండల వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఎపిఎం రజియా సుల్తానా బేగం, వెలుగు సిసిలు, విఒఎలు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది , మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు

సాగు నీరందక అన్నదాతల అగచాట్లు

(మొదటిపేజీ తరువాయి)

చేరని కారణంగా మాగాణి సాగుకు సరిపడా నీరు ఇచ్చే పరిస్థితి లేదని ఆరుతడి పంటలకు రైతులు సన్నద్ధం కావాలన్న ఒక ప్రకటనతో ప్రభుత్వ యంత్రాంగం మిన్నకుండిపోయింది. పులిచింతల నుంచి కొంతమేర నీరు రావడంతో వాటిని కాలువకు విడుదల చేస్తూ వచ్చారు. కొంతమేర పట్టిసీమ నుంచి కూడా సాగునీరు వస్తుంది. కానీ కృష్ణా పశ్చిమ డెల్టా మాగాణి భూములకు సరిపడా సాగు నీరు రాకపోవడంతో కొమ్మమూరు కాలువ చివరి భూములకు నీరందే పరిస్థితి లేకపోయింది. కొమ్మమూరు కాలువ కింద 2.63 లక్షల ఎకరాలకు గానూ సుమారు 1.80 లక్షల ఎకరాల్లోనే వరి సాగు చేశారు. సాగు చేసిన వరి పంటకు కూడా సరిపడా నీటి సరఫరా లేదు. ఈ కారణంగా వారబందీ విధానంలో సాగునీరు సరఫరా చేస్తున్నారు. దుగ్గిరాల లాకులకు ఎగువన ఉన్న 5 కాలువలను మూసి వేసి దిగువకు 2,240 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. అయినప్పటికీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి పైరుకు నీరు రాక మాగాణి భూములు పొడి బారిపోవడం నెర్రెలివ్వడం జరుగుతుంది. దీంతో వరి పైరు పొట్టపోసుకునే ముఖ్యమైన దశలో పంటను కాపాడుకోవడం కోసం రైతులు కాలువలపై ఆయిల్ ఇంజన్లు పెట్టి పొలాలకు నీరు అందిస్తున్నారు. ఈ కారణంగా రైతులకు ఆయిల్ ఇంజన్ ఖర్చు అదనంగా చేరుతుంది. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున మాగాణి పొలాలు త్వరితంగా ఎండిపోతున్నాయి. ఎండిన వరిపంట పొలాల్లో అధికంగా కలుపు రావడంతో కూలీల ఖర్చు పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. అందివచ్చే దశలో ఉన్న వరి పంటను కాపాడుకోవడం కోసం రైతులు తంటాలు పడుతున్నారు. కొమ్మమూరు కాలువ పరిధిలో బాపట్ల, చీరాల, చినగంజాం ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు పైగా వరి సాగు చేయాల్సి ఉండగా రైతులు వరి సాగుకు సిద్ధపడాలా లేక ఆరుతడి పంటలు వేసుకోవాలా అనే సందిగ్ధంలో ఉండిపోయారు. కొందరు రైతులు సెప్టెంబరు నెలలో సాగు నీరు అందుతాయన్న ఆలోచనతో వరినార్లు పోశారు. బోర్లు, ఆయిల్ ఇంజన్లతో నార్లు కాపాడుకున్నారు. వరి నాట్లు వేయాల్సిన సమయం వచ్చినా గానీ కొమ్మమూరు కాలువ చివరి భూములకు సాగునీరందే పరిస్థితి లేకపోయింది. కొమ్మమూరు కాలువకు 800 క్యూసెక్కుల లోపు ఇస్తున్నారు. ఈ కారణంగా బాపట్ల, చీరాల, కారంచేడు, చినగంజాం ప్రాంత మాగాణి భూములకు నీరందే పరిస్థితి లేకపోయింది. దీంతో పాటు గత మూడేళ్లుగా పశ్చిమ డెల్టా పరిధిలోని సాగునీటి కాలువల మరమ్మతులు సక్రమంగా చేయకపోవడంతో వస్తున్న కొద్దిపాటి నీరు కూడా పంట పొలాలకు చేరే వీలులేకుండా పోతుంది.

సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలిలోని ఇరిగేషన్ కార్యాలయాన్ని రైతులు నాలుగు రోజుల క్రితం ముట్టడించారు. కష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ ద్వారా విడుదలయ్యే నీరు తెనాలి, రేపల్లె, బాపట్ల డివిజనల్ పరిధిలో లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందు చూపు లేకపోవటం వల్ల రైతులు పంటలను కోల్పోయో దుస్థితి తలెత్తిందని ఆరోపించారు. రేపల్లె టిడిపి శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ పంటపొలాలకు సాగునీరివ్వకపోతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ప్రజాప్రతినిధులు గడపగడపకూ తిరగటం కాకుండా పంట పొలాల్లోకి వెళ్లి పరిశీలిస్తే రైతులు పడుతున్న బాధలు కనిపి స్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్టనట్లుగా ఉంటుందని, సాగునీరు రప్పించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న గంటెనపల్లి శ్రీనివాసులు

నూతన కమిటీ ఎన్నిక

కొత్తపట్నం : మండల పరిధిలోని మడనూరు గ్రామంలో ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది కార్మికులు సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా రోడ్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ ఆటో కార్మికులు ప్యాసింజర్లు, వివిధ రకాల సరుకులను గమ్యస్థానాలకు చేర్చడంలో నిజాయతీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్లు అని తెలిపారు. దేశంలో రోడ్లు పరిస్థితి బాగాలేదన్నారు. రోడ్లు బాగుపడినప్పుడే ప్రమాదాలు తగ్గుతాయన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్.సోమిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.అజయ్ కుమార్ ,కార్యదర్శిగా యానాది ,కోశాధికారిగా కె.గి ,ఉపాధ్యక్షులుగా కృష్ణ ,ఎం.రామకష్ణ ,సహాయ కార్యదర్శులుగా డి.సురేష్,బక్కా వెంకటేశ్వర్లు ,కమిటీ సభ్యులుగా పి.జాలయ్య ,వై.అంకయ్య ,ఎల్. అనిల్ ,సిహెచ్. సువర్ణారావు ,బి.సాయి ఎన్నికయ్యారు.

సినీఫక్కీలో భార్య హత్య..

(మొదటిపేజీ తరువాయి)

హుటాహుటిన వచ్చిన భార్య బంధువులు శ్రీను ప్రవర్తనపై అనుమానించి.. పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సాగర్ కాలువ వద్దకు వచ్చిన పోలీస్‌లు శ్రీనును యర్రగొండపాలెంలోని సర్కిల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ సిఐ మారుతీకష్ణ శ్రీనును విచారించగా సంచలన విషయాలు బయటకు వచ్చాయి. కుటుంబకలహాల నేపథ్యంలో ప్లాన్ ప్రకారం తన భార్యను బైక్ ఎక్కించుకుని కాలువలోకి దూసు కెళ్లానని, ఆ తరువాత తాను ఈదుకుంటూ బయటకు వస్తుండగా తాను తనని పట్టుకొని బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా విదిలించుకుని కాలువ నుంచి ఒడ్డుకు చేరానని శ్రీను చెప్పినట్లు సిఐ తెలిపారు. గల్లంతైన కోటేశ్వరి కోసం పోలీసులు, బంధువులు గాలిస్తుండగా త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం వద్ద కాలువలో శవమై తేలియా డుతూ కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం నిమిత్తం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. తల్లి చనిపోవటం, తండ్రి పోలీసుల అదుపులో ఉండటంతో పిల్లలూ అనాథలుగా మారారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు పుల్లలచెరువు ఎస్ఐ తెలిపారు.

అమృత్ కలశ్ ర్యాలీ

టంగుటూరు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అమృత్ కలశ్ యాత్ర, ర్యాలీ ఆదివారం నిర్వహించారు. కళాశాల వద్ద నుంచి వల్లూరు వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నా భూమి-నా దేశం, నా మట్టి-నా దేశం, అమర వీరులారా జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వల్లూరు గ్రామంలో మట్టి, ధాన్యపు గింజలను సేకరించారు. . ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లికార్జునరావు, కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ మూర్తి, స్టూడెంట్స్ డీన్ వీరాంజ నేయులు, ఎఒ రమణబాబు పాల్గొన్నారు.

పేపర్ ప్రకటన

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్.నెం. 305/2022

సీలం బాలిరెడ్డి చనిపోయారు అతని వారసులు
సీలం లక్ష్మి సువర్ణ మరియు ఇతరులు ....వాదులు
వర్సెస్
ఎన్నం రామసుబ్బారెడ్డి మరియు ఇద్దరు
....ప్రతివాదులు

ప్రతివాది చిరునామా:-

3వ (ప్రతివాది) ఎన్నం వెంకటసుబ్బారెడ్డి తండ్రి రామిరెడ్డి, వయస్సు సుమారు 35సంవత్సరాలు, హిందూ, ఎంప్లాయ్, బ్రాహ్మణపల్లె గ్రామం, కొమ్మునూరు మజర గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైయింటు పరిహారం రాగోరి మీపై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 16వ తేదీ అక్టోబర్ నెల 2023సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మా నించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేది:15.10.2023

శ్రీ షేక్.యాసిన్‌బాషా
వాది తరుపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.9346513649

పేపర్ ప్రకటన

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్.నెం.167/2022

చేపురి లక్ష్మీదేవి ..... వాది
వర్సెస్
గద్దె శారదాంబ మరియు ఐదుగురు......ప్రతివాదులు

ప్రతివాది చిరునామా:-

1వ (ప్రతివాది) గద్దె శారదాంబ భర్త లేట్ గద్దె రమణయ్య, వయస్సు సుమారు 72సంవత్సరాలు, హిందూ, గృహిణి, C/o. గోపిశెట్టి ఆంజనేయులు(ప్లాట్స్ వ్యాపారము), వేములకోట గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

3వ (ప్రతివాది) గోపిశెట్టి పద్మ భర్త ఆంజనేయులు(ప్లాట్స్ వ్యాపారము), తండ్రి లేట్ గద్దె రమణయ్య, వయస్సు సుమారు 46సంవత్సరాలు, హిందూ, గృహిణి, వేములకోట గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైయింటు పరిహారం రాగోరి మీపై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 19వ తేదీ అక్టోబర్ నెల 2023సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మా నించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేది:15.10.2023

శ్రీ షేక్.యాసిన్‌బాషా
వాది తరుపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.9346513649

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు యర్రగొండపాలెం మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు ఆదివారం తెలిపారు. దసరా సెలవులలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వారిని ఒంటరిగా ఎక్కడికి పంపించవద్దని సూచించారు.



పి.ఆంజనేయులు



నగదును అందజేస్తున్న దృశ్యం

రూ.50వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణానికి చెందిన కీర్తి అనే మహిళ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు హెల్పిండ్ హ్యాండ్స్ సంస్థ రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపరేషన్‌కు కావల్సిన డబ్బు ఆమె వద్ద లేక ఆమె పడుతున్న ఆర్థిక ఇబ్బందులను హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుర్తించారు. డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డి ప్రోత్సాహంతో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బొబ్బా విజయభాస్కరరెడ్డి, గోళ్ల పాండురంగారావు, తుంబేటి సుబ్రమణ్యం, పాలువాది శ్రీనివాసరావు, కొప్పరపు శ్యామ్, సూరె శివప్రసాద్‌లు నగదును బాధితురాలు కీర్తికి ఆదివారం సాయంత్రం అందించారు. హెల్పింగ్ హ్యాంగ్స్ సభ్యుల వితరణ మరువలేనిదని కీర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

102 కలశాలతో గ్రామోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా యర్రగొండపాలెంలోని శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో 102 కలశాలు, 102 గోత్రికలతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు అమ్మవారి దేమాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి దేవస్థానం అధ్యక్షులు సూరె వెంకట ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణమూర్తి, అదనపు ప్రధాన కార్యదర్శి గోళ్ల వెంకట కృష్ణారావు, కోశాధికారి గ్రంధి రమణారావు, అదనపు కోశాధికారి సూరె శ్రీనివాసరావులతో పాటు కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం నాగండ్లలో పేకాట శిబిరంపై ఇంకొల్లు పోలీసులు దాడి చేశారు. 15 మంది వ్యక్తుల నుంచి రు.52,650 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ షేక్ నాయబ్ రసూల్ వివరించారు. పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. పేకాట నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని నాయబ్ రసూల్ హెచ్చరించారు.

ఘనంగా కలాం జయంతి వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ముస్లిం యూత్ సొసైటి ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని ఆ సొసైటి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ సొసైటి అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి మొదలైన అబ్దుల్ కలాం ప్రస్థానం ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని ఇస్రో, డిఆర్‌డిఓ వరకు ఆయన ఈ దేశాన్ని అభివద్ధి దిశగా పంపించారన్నారు. ఆయన మొత్తం జీవితం ప్రతి భారతీయుడికి, మరీ ముఖ్యంగా యువతరానికి ఒక ఆదర్శం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సభ్యులు షేక్ షరీఫ్, చోటు, షేక్ చాంద్, సయ్యద్ అహమ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

త్రిపురాంతకంలో మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శరన్నవరాత్రులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీరి వెంటఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, నాయకులు ఐవి సుబ్బారావు, రోశిరెడ్డి, త్రిపురాంతకం సర్పంచ్ వెంకటలక్ష్మి, దేవస్థానం సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో మంత్రి సురేష్

ఆర్‌టిసి బస్సులో మద్యం తాగుతూ...

ప్రజాశక్తి-చీరాల

ఆర్‌టిసి డ్రైవర్ క్యాబినపైన కూర్చొని మద్యం సేవిస్తున్న ఈ తతంగం అంతా బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ ప్రయాణికురాలు వీడియో తీసి వైరల్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల మేరకు..చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు శనివారం రాత్రి లాస్ట్ బస్సులో భాగంగా ఒంగోలు నుంచి చీరాలకు బయలు దేరింది. అదే బస్సులో కడవకుదురుకు చెందిన ఓ వ్యక్తి నిత్యం అదే బస్సులో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో పందిళ్ళపల్లికి చెందిన ఆ బస్సు డ్రైవర్ తో స్నేహపూర్వకంగా ఉంటూ చివరి బస్సు కావటంతో అడిగేవారు లేరంటూ ఏకంగా బస్సులోనే డ్రైవర్ క్యాబిన్ పైన మందు బాటిల్ ఓపెన్ చేసి బస్సులోనే మద్యం సేవించారు. అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలు ఈ వీడియోను తన మొబైల్లో చిత్రీకరించి స్నేహితులకు పోస్ట్ చేయడంతో అది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో ఇలాంటి ఘటన తలెత్తడంతో ప్రయాణికులందరూ ఆర్టీసీ పనితీరుపై విమర్శలు గుప్పమనిపిస్తున్నారు. మద్యం మత్తులో ప్రమాదం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



మద్యం సేవిస్తున్న దృశ్యం

హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఈ నెల 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మేయర్ రాధాకష్ణ హాకీ స్టేడియంలో నిర్వహించే ఒకటో సౌత్ జోన్ నేషనల్ టోర్నమెంట్‌కు వెళ్లే ఆంధ్ర ప్రదేశ్ సబ్ జూనియర్ పురుషుల జట్టుకు జిల్లాకు చెందిన తిరుమలశెట్టి రవికుమార్(హాకీ రవి) మేనేజర్‌గా నియమితులయ్యారు. రవికుమార్ మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఇటిగా పనిచేస్తున్నారు. ఈ మేరకు మేనేజర్‌గా నియమిస్తూ హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం పట్ల హాకీ ప్రకాశం కార్యదర్శి ఎ.సుందరామిరెడ్డి, గొడుగు కాలేశా, బ్రహ్మయ్య, యు.మారుతి, పి.రవి, మాధవరావు సంతోషం వ్యక్తం చేశారు. హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, కార్యదర్శి హర్షవర్ధన్, ట్రెజరర్ పీటర్ థామస్, హాకీ ప్రకాశం కార్యదర్శి సుందర రామిరెడ్డిలకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



తిరుమలశెట్టి రవికుమార్

వైభవంగా దేవీ నవరాత్రులు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక దర్శిలోని కనకదుర్గమ్మ ఆలయం, పోలేరమ్మ గుడిలో దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని అలంకరించి నవరాత్రులు ప్రారంభించినట్లు నిర్వాహకులు మారం శివకోటిరెడ్డి, కర్నా రమణారెడ్డిలు తెలిపారు. పోలేరమ్మ, కనకదుర్గమ్మ తదితర ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఏఎంసీ చైర్మన్ సూరె చిన్న సుబ్బారావు కుటుంబ సమేతంగా దేవీ నవరాత్రుల వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దేవీ నవరాత్రుల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.



బోల్తా పడిన కారును క్రైన్‌తో పక్కకు తీస్తున్న దృశ్యం

బ్రిడ్జిని ఢీ కొట్టి కారు బోల్తా వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి సినీ ఫక్కీలో గాల్లోకి ఎగిరి జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. ఆ సమయంలో అటుగా ఏ వాహనాలు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న వాహన యజమాని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని కోనంకి-కోలలపూడి గ్రామాల మధ్య ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం.. నెల్లూరు పట్టణానికి చెందిన పి.చంద్రమౌళి వ్యక్తిగత పనుల మీద గుంటూరు వెళ్లి అనంతరం తిరిగి నెల్లూరుకి తన కారులో వెళ్తున్నాడు. కోనంకి దాటాక కారు అదుపుతప్పి ఒక్క సారిగా రోడ్డు ప్రక్కనే ఉన్న బ్రిడ్జి గోడను ఢీ కొట్టి జాతీయ రహదారిపై పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చంద్రమౌళి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది కారులో ఇరుక్కుపోయిన చంద్రమౌళిని బయటకు తీసి హై వే అంబులెన్సులో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి-శింగరాయకొండ

అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బైరాగి మాన్యంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామానికి చెందిన చిమటా చందనకు శింగరాయకొండకు చెందిన జయకృష్ణతో ఏడు నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో అత్త, భర్త వేధింపులు తాళలేక చందన బాతురూంలోని దులానికి చున్నీతో ఉరేసుకొంది. ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులు బాతురూం తలుపును పగలగొట్టి చందనను చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం చందన ఐసియులో చికిత్స పొందుతుంది. చందన తండ్రి బత్తుల మాధవ ఫిర్యాదు మేరకు శింగరాయకొండ ఎస్ఐ టి.శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అబ్దుల్ కలాం జాతీయ అవార్డు'కు 'గంగిశెట్టి' ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని 'గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్' అబ్దుల్ కలాం జాతీయ అవార్డు-2023కు మార్కాపురం పట్టణానికి చెందిన గంగిశెట్టి కిరణ్‌ను ఎంపిక చేసింది. గంగిశెట్టి కిరణ్‌కుమార్ మార్కాపురంలో అరుణ మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. వి207ఎ జిల్లా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా, మార్కాపురం పట్టణ మెడికల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సమాజాభివృద్ధిలో రాణిస్తున్న గంగిశెట్టి కిరణ్‌కుమార్‌ను 'అబ్దుల్ కలాం జాతీయ అవార్డు-2023' ఎంపిక చేశారు. ఈ విషయాన్ని గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ గొట్టేముక్కల చెన్నకేశవులు వెల్లడించారు. ఈ మేరకు కిరణ్‌కుమార్‌కు మెమోంటో, అవార్డుతో సత్కరించారు.



గంగిశెట్టి కిరణ్

అబ్దుల్ కలాం.. నేటి యువతకు ఆదర్శం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బాపట్ల ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగింది. కళాశాల1990-93 బిఎ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యాపకులు జి శాంతా రామ్, పి విజయ్ కుమార్, శ్రీనివాసరాజు, ఏ రాజ్యలక్ష్మి, ఏఎస్ఎన్ శర్మ, బి సాంబశివరావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాయల్‌లో దసరా వేడుకలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

నేటి చిన్నారులకు పండుగ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాయల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు అన్నారు. దసరా పండుగ సందర్భంగా రాయల్ స్కూలులో చిన్నారులచే ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో అందరినీ అలరించారు. పండుగ విశిష్టతను గురించి ఈ సందర్భంగా రవీంద్రబాబు వివరించారు. ప్రత్యేక వేషధారణతో అలరించిన చిన్నారులను పాఠశాల డైరెక్టర్ పేరం స్వప్న, ఇన్‌చార్జ్ కుడారి మధుబాబు, హెచ్ఎంలు డీవీ బాలసుబ్రమణ్యం, కోటేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రేపల్లె

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఆర్థిక సాయం అందించారు. రేపల్లె రూరల్ మండలం పోటుమేరక గ్రామానికి సంబంధించిన కన్నా సరస్వతికి ఆరోగ్యం బాగోలేదని గ్రామ సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి వారి కుటుంబ సభ్యులకు రూ.35,000/- ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పోటుమేరక గ్రామ సర్పంచ్ కాగితాల హనుమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణంశెట్టి కనకయ్య ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి-పర్చూరు: కామ్రేడ్స్ చాగంటి భాస్కరరావు, కృష్ణంశెట్టి కనకయ్య న్యాయ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎర్రజెండా సెంటర్, గర్ల్స్ హైస్కూల్, జూనియర్ కాలేజీ ఆవరణలో పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ శ్రీకృష్ణంశెట్టి కనకయ్య జన్మదినం సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత 12 గంటలకు స్థానిక నేతాజీ యువ కేంద్రం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె అశోక్ కుమార్ మాట్లాడుతూ 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అని మాస్టర్ ఎప్పుడూ చెబుతాడని, బడుగు బలహీన వర్గాల సమాజ సేవకుడు, అందరివాడు కామ్రేడ్ కృష్ణంశెట్టి కనకయ్య అని అన్నారు. న్యాయ విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్స్ కాసా అశోక్ కుమార్, కొమ్మాలపాటి రవికుమార్, కామ్రేడ్ కృష్ణంశెట్టి కనకయ్య మాస్టారు ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. మాస్టర్ జన్మదినం జరపటం సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో కె కిషోర్, ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిసిపి అధ్యయన కేంద్రాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-బాపట్ల: పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రాం అధ్యయన కేంద్రాలను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు ఆదివారం పరిశీలించారు. బాపట్ల లో మల్లెల కేథరిన్ జూనియర్ కళాశాల, సాల్వేషన్ ఆర్మీ విలియం బూత్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న అధ్యయన కేంద్రాలను రామారావు పరిశీలించారు. పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రాం ప్రాముఖ్యతను అభ్యాసకులకు డీఈఓ రామారావు వివరించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ సొసైటీ అందిస్తున్న స్వీయ అభ్యాసన సామాగ్రి, అపాస్- జ్ఞానధార దృశ్య పాఠ్యాంశాలను అభ్యాసకులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. పరిశీలన కార్యక్రమంలో పిసిపి రాష్ట్ర సమన్వయకర్త ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బాపట్ల

క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్మోహన్ చెట్టి అన్నారు. ఆదివారం అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చెట్టి మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం మానవీయ విలువలను పుణికి పుచ్చుకున్న మహామనిషి అని అన్నారు. కరుణ, దయ, అహింస వంటి విలువలకు ఆయన ప్రతిరూపం. నీతి నిజాయితీలకు, నిస్వార్థతకు ఆయన మారుపేరు. ఆయన నిరాడంబరత అద్వితీయమైనది. దేశభక్తి అపురూపమైనది. దేశం కోసమే తన సర్వస్వాన్ని వెచ్చించిన మహనీయుడని కొనియాడారు. కలాం పేపర్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి, క్షిపణి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఉన్నతమైన స్థానాలను చేరుకున్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, నర్రా సాంబు, సురేష్, లక్ష్మి పాల్గొన్నారు.

కలాం ఆశయాలకు పునరంకితమవుదాం

ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా బీసీ సంఘాల బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం బాపట్ల మున్సిపల్ ఆఫీస్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కలాం ఆశయ సాధనకు పునరంకితమవుతామని సమాజ్‌వాది పార్టీ బాపట్ల జిల్లా శాఖ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గొర్ల శ్రీనివాసరావు, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాపట్లలో కలాం విగ్రహానికి ఆ పార్టీ నాయకులు ఆదివారం నివాళులర్పించారు.



బాపట్లలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భావితరాలకు కలాం స్ఫూర్తిదాయకం కావాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, దోనేపూడి రవి, నక్కల రాంబాబు, గాంధీ, శీలం సాగర్, తాజుద్దీన్, రేణుక, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె: దేశ ప్రజలకు, భావితరాల భవిష్యత్తుకు ఎన్నో సూచనలు అందించిన స్ఫూర్తి ప్రదాత, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలామ్ అని పట్టణ సీఐ నజీర్ బేగ్ అన్నారు. కలాం జయంతి సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నజీర్ బేగ్ మాట్లాడుతూ తమిళనాడులోని రామేశ్వరంలో సాధారణ, మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కలామ్ ప్రపంచ ఖ్యాతి పొందారని కొనియాడారు. భౌతిక శాస్త్రంలో విశేష ప్రతిభను కలిగి ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ఇంజనీర్‌గా పనిచేశారని చెప్పారు. భారతదేశం యొక్క మిస్సైల్ మాన్‌గా పిలవబడే కలాం, బాలిస్టిక్ క్షిపణి, వాహన ప్రయోగ టెక్నాలజీ అభివృద్ధికి కృషి చేశారని వివరించారు. 1998లో భారతదేశ పోఖ్రాన్ అణు పరీక్షలలో కీలకమైన, సంస్థాగత, సాంకేతిక, రాజకీయ పాత్ర పోషించిన గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడారు.



మార్టూరు మండలం వలపర్ల జడ్‌పి ఉన్నత పాఠశాలలో..

భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్తగా, 11వ భారత రాష్ట్రపతిగా సేవలు అందిచారని తెలిపారు. మంచి కోసం చేసే పోరాటంలో ఓడిపోయినా అది గెలుపే అవుతుందని యువతకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు కలామ్ అన్నారు. మన జననం ఓ సాధారణమైనదే కావచ్చు, కానీ మన మరణం మాత్రం ఒక చరిత్రను సృష్టించేదిగా ఉండాలనే ఆయన సందేశాలు ఆచరణీయం అని అన్నారు.

మార్టూరు రూరల్: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు అబ్దుల్ కలాం అని నేతాజీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సయ్యద్ కరీముల్లా అన్నారు. కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వలపర్ల జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఎన్నో ఆశయాలతో నిరంతరం శ్రమతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో నయీమ్ బాషా, కరీముల్లా, ఫజల్, ముజకిర్, డాక్టర్ రాయ్ పాల్గొన్నారు.

చీరాల: భారత మాజీ రాష్ట్రపతి,భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఆదివారం స్థానిక చీరాల ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సమితి సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఏపీజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం వైద్యశాలలో రోగులకు బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు. చీరాల మునిసిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు షేక్ హుమయూన్ కబీర్, షేక్ సుభాని, షేక్ సలాం, మేరిగ ఇస్సాకు, షేక్ రియాజ్, సికా సురేష్, సయ్యద్ గౌస్ బాషా, ఇలియాస్, అన్సర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రేపల్లె సిఐ నజీర్ బేగ్



చీరాలలో కలాంకు నివాళి..

చేతుల శుభ్రత దినోత్సవం

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని బిలీవర్స్ చర్చ్ ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రజలకు అనేక సూచనలు, సలహాలు ఒంగోలు మిషన్ ప్రొవిన్స్ స్త్రీల సహవాస నాయకురాలు కరుణ జ్యోతి తెలియ జేశారు. స్త్రీల సమాజం పాల్గొని అనేక విషయాలు నేర్చుకున్నారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




చేతుల శుభ్రతపై వివరిస్తున్న మహిళలు

విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకించండి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు జి ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు. ఇంకొల్లు బస్టాండ్ సెంటర్ లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం విద్యుత్ చార్జీలు పెంచి రూ.1400 కోట్లు ప్రజలపై భారాలు మోపిందన్నారు. గత 10 ఏళ్ల నుంచి వాడుతున్న విద్యుత్‌కు అప్పుడు బిల్లులు కట్టినప్పటికీ మరలా సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభావాలపై రూ.6 వేల కోట్లు భారం వేసిందన్నారు. గత నాలుగు సంవత్సరాలలో రూ.25 వేల కోట్ల విద్యుత్ భారాలు ప్రజలపై వేశారన్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, గంగయ్య, రవికుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్న దృశ్యం

జగన్ పాలనలో అంతా సుభిక్షం: మోపిదేవి

ప్రజాశక్తి-నగరం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉన్నారని, రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే న్యాయస్థానం ఒక నిర్ధారణకు వచ్చి జైల్లో రిమాండ్ విధించిందని చెప్పారు. జైలు నిబంధనల ప్రకారం ఎవరికైనా కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టానికి ఎవరూ చుట్టం కాదని చెప్పారు. కానీ నిన్న మొన్నటి వరకు చట్టాన్ని చుట్టంగా మార్చుకున్న ఘనుడు చంద్రబాబేనని అన్నారు. సహజంగా ఎవరైనా జైలుకు వెళితే మానసిక వేదనతో ఆహారం సరిగా తీసుకోక బరువు తగ్గుతారని, కానీ చంద్రబాబు విషయంలో మాత్రం అయన బరువు పెరిగారని చెప్పారు. దీన్నిబట్టి చంద్రబాబు ఎంత ప్రశాంతంగా ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చని చెప్పారు. చంద్రబాబు జైలుకు వెళ్లే సమయంలో 66 కేజీలు ఉన్నారని, కానీ ప్రస్తుతం ఆయన ఒక కేజీ పెరిగారని, ఇది సంతోషకరమైన విషయమేనని చెప్పారు. చంద్రబాబు జైల్లో హాయిగానే ఉన్నారని, బయట మాత్రం టిడిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు విచిత్రంగా డప్పులు, ఈలలు, కొవ్వొత్తులు ర్యాలీలు, పళ్లాలు మోగిస్తూ నిరసనలు తెలియజేస్తున్నా ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, పిఎసిఎస్ చైర్మన్ బెల్లంకొండ పోలేరు వెంకట్రామయ్య, గ్రామ సర్పంచ్ కేసన పున్నమ్మ వెంకట్రామయ్య, మండల పరిషత్ ఉప అధ్యక్షులు, కె లక్ష్మీ భ్రమరాంబ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




ప్రజలతో మాట్లాడుతున్న మోపిదేవి

విద్యుత్ భారాలపై ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పొందూరు గ్రామంలో విద్యుత్ భారాలపై ప్రజా బ్యాలెట్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 62 మంది ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. అందులో 60 మంది కరెంటు ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ వేశపోగు మోజెస్, ఎంఎల్ పార్టీ నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వేజెండ్ల రామారావు, గుళ్ళపల్లి వెంకట్రావు, బెజవాడ శివరామకష్ణ పాల్గొన్నారు. **ఒంగోలు :** సిపిఎం కొప్పోలు శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై ప్రజా బాల్యెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా 98 శాతం మంది ఓటు వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా సభ్యులుబొడపాటి రాఘవరావు, గంగాడి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. **పిసిపల్లి :** విద్యుత్ ఛార్జీల పెంపుదలపై సిపిఎం ఆధ్వర్యంలో పిసిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కనిగిరి డివిజన్ నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రకరకాల ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపి వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. అనంతరం పోలైన బ్యాలెట్లను బాల్కో విశ్రాంత ఉద్యోగి గంగిశెట్టి నరసింహం, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఎలక్ట్రికల్ బోర్డు విశ్రాంత ఉద్యోగి బడుగు మాలకొండయ్య లెక్కించారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా 98 శాతం ఓట్లు వచ్చినట్లు తలెఇపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు గుంటగాని యాకోబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు జనార్ధన్, బట్టుపల్లి మాజీ సర్పంచి మూలే పుల్లారెడ్డి, ముద్దపాడు మాజీసర్పంచి ఎన్.రత్తయ్య, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి రత్నం, విశ్రాంత రైల్వే ఉద్యోగి మాలకొండయ్య,గురుమూర్తి పాల్గొన్నారు.



టంగుటూరులో ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్న నాయకులు


కొప్పోలులో ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్న నాయకులు

'ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్'పై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు

కెమెరామెన్ మీడియా అసోసియేషన్ హాలులో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి అధ్యక్షతన పథకంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ మేనేజర్ సామంతపూడి సుబ్బారావు మాట్లాడుతూ సాంప్రదాయ చేతికులవత్తి దారులను అదుకోవడమే ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ యోజన పథకం యొక్క ముఖ్యఉద్దేశ్యమని తెలిపారు. చేతి వత్తుదారులందరూ పారిశ్రావివేత్తలకు ఎదగడానికి అర్హులైన వారు బ్యాంకు సహకారం తీసుకోవాలన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు ఆర్‌బిఒ అసోసియేట్ నూతలపాటి రాజేష్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించే యువతీ, యువకుల్లో అర్హులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీడియో అండ్ కెమెరామెన్ ఒంగోలు అసోసియేషన్ అధ్యక్షుడు ఏల్చూరి నాగేశ్వరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు ఆర్‌బిఒ కార్యాలయం ఆఫీసర్. నూతలపాటి రాజేష్, విశ్రాంత డిప్యూటీ మేనేజర్ సామంతపూడి సుబ్బారావు వారి సతీమని రమాదేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణిదపు సుధాకర్, ఏల్చూరి హేమంత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని, నూతలపాటి పోతులూరి ఆచారి , కోశాధికారి దక్షిణామూర్తి, ప్రజాశక్తి బ్యూరో సామంతపూడి బ్రహ్మం, నూతలపాటి హరిబాబు, మోతుకూరు నాగేశ్వరరావు, దిలీప్, కుందుర్తి నాగ ఆంజనేయులు, వినుకొండ సుబ్బయ్య, అనంత మాధవ్, కలిచేటి నాగ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.


సన్మానం అందుకుంటున్న అతిథులు


బోరును ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి

బోరు ప్రారంభం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మండలం ఏరువారిపల్లి పంచాయతీ పరిధిలోని అజీస్‌పురంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ సమస్య గురించి గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య జడ్‌పిటిసి మడతల కస్తూరి రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జడ్‌పిటిసి జడ్‌పినుంచి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులలో బోరు, పైపులైన్ నిర్మాణం చేపట్టి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన జడ్‌పిటిసికి గ్రామసర్పంచి, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య, వైసిపి నాయకులు వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి,మేడం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

టిటిడి బోర్డు సభ్యులు, వైసిపి యువ నాయకుడు శిద్దా సుధీర్‌కుమార్ ముందస్తు పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఒంగోలులోని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణ, చందోలు మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతులు, మాజీ మంత్రి శిద్దారాఘవరావు, లక్ష్మిపద్మావతి దంపతులు ,శిద్దా ఆరాధ్య, శిద్దావ్రిష్‌తో కలిసి కట్ చేశారు. అనంతరం జ్యోతి గ్రానైట్ సిబ్బంది, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య సంఘం నాయకులు జలదంకి కృష్ణారావు, కాశీరంగ జనార్ధన్, కొత్తూరి రంగనాయకులు, జ్యోతి గ్రానైట్ యువ పారిశ్రామికవేత్తలు బొమ్మిశెట్టి కిరణ్‌కుమార్, చల్లగండ్ల హనుమంతరావు, నూకల సురేంద్ర,గ్రంది . శ్రీహరి, గుప్తాస్ వారబాబు, వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సుధీర్ కుమార్ సన్మానిస్తున్న నాయకులు


సుధీర్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి


కేక్ కట్ చేస్తున్న శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు


విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి- దొనకొండ

వ్యవసాయానికి ఇచ్చే 9గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ మండల పరిధిలోని పెద్దన్న పాలెం గ్రామ రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పురుగుల మందుల డబ్బాలతో ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి ఇచ్చే 9 గంటల విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. దీంతో తాము లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నట్లు తెలిపారు. 9 గంటలకు పేరుతో 5 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్‌లో అంతరాయం వల్ల మోటారు కాలిపోతున్నట్లు తెలిపారు. విద్యుత్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక రాంత్రిభవళ్లు పొలాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9 గంటల పాటు నిరంతం విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎఇ షేక్ నాగూర్ మాట్లాడుతూ పెద్దన్నపాలెం రైతులకు సరఫరా చేస్తే విద్యుత్ లైన్‌లో సాంతికేతిక సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఆ సమస్యలను పరిష్కరించి పగటి పూటి ఏడు గంటలు, రాత్రి పూట రెండు గంటల పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు.


మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఎంపీ మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు ఒంగోలులోని ఆయన కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వేడుకలకు కొండపి నియోజకవర్గం లోని 6 మండలాల నుంచి కార్యకర్తల భారీగా తరలి వెళ్లి మాగుంటకు జన్మ శుభాకాంక్షలు తెలిపారు. మాగుంటకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి రాష్ట్ర నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, వైసిపి మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుల్తాన్, బీసీసెల్ నాయకులు కుంచాల సాయి వేణు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. **కనిగిరి :** ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పుట్టిన రోజు వేడుకలో ఒంగోలులో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి , పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం. ప్రసాద్ రెడ్డి పాల్గొని మాగుంట శ్రీనివాసులరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాగుంటకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సర్పంచులు ముద్దా బాబు, దమ్ము వెంకటయ్య , రవీంద్ర రెడ్డి, వైసిపి నాయకులు వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్ రెడ్డి , మస్తాన్, శివా రెడ్డి, అమర్ నాథ్ , చైతన్య , నరేంద్ర తదితరులు ఉన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న రోటరీలకు సభ్యులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బాలికా విద్యను ప్రోత్సహిచాలని తెలంగాణ జిల్లా భద్రాచలంకు చెందిన రోటరీ డిస్ట్రిక్ట్ 3150 డిస్టిక్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన శింగరాయ కొండకు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రోటరీ క్లబ్ శింగరాయకొండ అధ్యక్షుడు మాలె రంగారెడ్డి, జెట్టి సూర్యచంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాకల గ్రామంలో సముద్రతీరం వద్ద మొక్కలు నాటారు. అనంతరం స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో వద్ధులకు మరియు యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాలికా విద్య ప్రోత్సాహంలో భాగంగా క్రీడా విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో జిల్లా స్థాయికి పోటీలకు ఎంపికైన ఫ్రెండ్స్ చిల్డ్రన్ హోమ్ లో వసతి పొందిన చిన్నారి కల్లగుంట అనుష్కకు సైకిల్ బహూకరించారు. ఈ సందర్భంగా డిస్టిక్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ సేవా కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా పని చేస్తుందన్నారు. సేవ, శాంతి, స్నేహం అనే నినాదంతో సేవాభావం ఉన్న వ్యక్తులు స్థానిక రోటరీ క్లబ్‌ల్లో చేరి తమ పరిసర ప్రాంతాల్లో నిస్సహాయులను గుర్తించి వారికి చేయూత నందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ లేవి ప్రసాద్, రోటరీ కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగసూరి వెంకటసుబ్బారావు, పాకల సర్పంచి సైకం చంద్రశేఖర్, పాకాల కోటేశ్వరరావు, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ డికెడి.ప్రసాద్, మర్రిపూడి రత్తయ్య, అబ్దుల్ సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి- కనిగిరి

దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని టిడిపి నాయ కులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి టిడిపి కనిగిరి నియోజక వర్గ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అబ్దుల్ కలాం చూపిన మార్గం అనుసరణీయమని ేఎర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి,టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, వివిఆర్. మనోహర్‌రావు, షేక్ అహ్మద్, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, నుదురుపాటి సుబ్బయ్య, పాలూరు సత్యం, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి. నారాయణ, కాశి పాల్గొన్నారు. **శింగరాయకొండ:** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డెమోక్రసీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ షేక్ షరీఫ్, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్‌అజీమ్, ఆరిఫ్, జావీద్, రహమతుల్లా, యస్థాని, అల్లాభక్షు, జిలాని తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు అభినందనీయం

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం అభినంద నీయమని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మట్టిగుంట గ్రామంలో దారా అంకయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బాలినేని ప్రారంభించి మాట్లాడారు. దారా పద్మజ తాత అంకయ్య మరణించి 40 సంవత్సరాలు గడిచినప్పటికీ ఆయన్ని స్మరించుకుంటూ వైద్యశిభిరం నిర్వహించి పేదలకు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. దారా పద్మజ మాట్లాడుతూ తమ తాత అంకయ్య 40 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్య సమరయోడుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో తానే పేదల కోసం వైద్యశిబిరం నిర్వహిం చినట్లు తెలిపారు.అనంతరం ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి ,ప్రసాద్ మల్టీసూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దారా సాంబయ్య , పాలపర్తి డేవిడ్ రాజు, ఎంపిపి నలమలపు అంజమ్మ కష్ణారెడ్డి దంపతులు, ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్, పి. కోటయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

కనిగిరి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జననీ చారిటబుల్ ట్రస్ట్, గుంటూరు శంకర నేత్రాలయం సహకారంతో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 8న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా కంటి ఆపరేషన్ల నిమ్తితం మూడో విడతగా 74 మంది వద్ధులను ప్రత్యేక వాహనాల్లో గుంటూరులోని శంకర నేత్రాలయం హాస్పిటల్‌కు ఆదివారం తరలించారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చేతలు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రతపై దష్టిసారించి, మన ఆరోగ్యం-మన చేతుల్లోనే ఉందన్న వాస్తవాన్ని గ్రహించాలని జిల్లా పంచాయతీ అధికారి జివి.నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ప్రపంచ చేతుల పరిశు భ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ హ్యాండ్ వాషింగ్ విత్ సోప్ ప్రాధాన్యతను గుర్తించడం, చేతి శుభ్రతతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబర్ 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. చేతి శుభ్రతతో అనేక రకాల వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. ప్రజలందరూ చేతుల పరిశుభ్రతపై దష్టిసారించి, ఆరోగ్యకరమైన భవిష్యత్ ను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వల్లూరు పద్మ, ఎంపిటిసి ఎల్లసిరి సత్యవాణి, పంచాయతీ విస్తరణాధికారి నర్రా జగదీష్ బాబు, పంచాయతీ కార్యదర్శి కె.స్వర్ణ కుమార్, నాయకులు కామని వెంకట్రావు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కనిగిరి :** చేతుల పరిశు భ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చునని జడ్‌పిటిసి మడతల కస్తూరి రెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద చేతుల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశు భ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఇఒపిఆర్‌డి ఒంగోలు అన్నమ్మ, ఏరువారిపల్లి సర్పంచి దమ్ము వెంకటయ్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **సిఎస్.పురం :** మండల పరిధిలోని అయ్యాలురివారిపల్లి గ్రామంలో సర్పంచి ముత్యాల భారతి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ నిర్వహించారు.ఈ సందర్భంగా చేతలు పరిశుత్రపై అవగాహన కల్పించారు. ఈ సచివాలయ సిబ్బంది, ఎన్‌హెచ్‌జి మహిళలు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

రాష్ట్రంలో హత్యలు, కక్ష రాజకీయాలతో కూడిన రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ మండల పరిధిలోని కోటతిప్పల, రసీదుపురం, లింగారెడ్డి పల్లి గ్రామాలలో గడపగడపకూ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబు అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడుకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సాని కొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరు పతిరెడ్డి, మురహరి నరసయ్య,గాయం రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్యామల వెంకటేశ్వర్లు, మాసిపోగు ఎర్రయ్య, బ్రహ్మంగౌడ్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

క్రమశిక్షణతో బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-పిసిపల్లి

క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు ఆర్.నారాయణ తెలిపారు. పిసిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో 1991 -92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణ మాట్లాడుతూ మానవ సంబంధాలు దెబ్బతింటున్న ఈ రోజుల్లో 30 సంవత్సరాల నాడు చదువుకున్న విద్యార్థులు అందరూ ఒకేవేదికపైకి చేరి అప్పట్లో చదువు చెప్పిన గురువులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డేగా ఆంజనేయులు, ఉపాధ్యాయులు నరసింహం, తిరుపతయ్య, వై.నరేష్, ఎస్.యేసుబాబు, పూర్వ విద్యార్థులు గోగడ శ్రీనివాసులు, గంధం రమేష్, మీనిగ మధుసూదన్‌రావు, అంద్ర శ్రీను, పసుపులేటి నరసింహం, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రకాశం జిల్లా మహిళా ఉపాధ్యాయులు

రాష్ట్ర సదస్సులో మహిళా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర మహిళా కన్వెన్షన్‌కు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 200 మంది మహిళా ఉపాధ్యాయులు హాజరయ్యారు. తిరుపతిలోని అశోకా ప్యాలెస్‌లో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎఎస్. కుసుమకుమారి అధ్యక్షత ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు,కెఎస్ఎస్. ప్రసాద్, గౌరవాధ్యక్షుదు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నాగమణి,ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి అరుణకుమారి, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు సంయుక్త, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, రాష్ట్ర నాయకులు శ్రీదేవి, ఆదిలక్ష్మి, శ్రీలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి నాయుడు, జిల్లా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, దారం వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా నాయకులు రజియా, హేమలత, శివపార్వతి, పిల్లి రమణమ్మ, జ్యోతి, సంధ్య, గోవిందమ్మ, లక్ష్మి, పద్మావతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి-కొమరోలు

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా నరేష్ రెడ్డి స్కూల్ పరిసర ప్రాంతంలో ప్రతి ఆదివారం ఉదయం 5.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ యోగాలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ చైతన్య సమితి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు, కొమరోలు మెడికల్ అధ్యక్షుడు డాక్టర్ దివాష్ బాషా తెలిపారు. బీసీ చైతన్య సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం ప్రజలు ఉచిత మోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి వ్యక్తి ఎంతో ఉత్సాహంగా ఆరోగ్యవంతంగా చలాకీగా ఉండాలని ఉద్దేశంతో ఈ యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసంఘటిత కార్మికులు

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

జిల్లాలో అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా తమ పేర్లు ఉచితంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని బాపట్ల సహాయ కార్మిక శాఖ అధికారి డివి శివ ప్రసాద్ తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ, వలస కూలీలు, రిక్షా కార్మికులు, గృహాల్లో పనిచేసే కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కార్మికులు, తోపుడుబండ్ల వ్యాపారులు, ఈ పోర్టల్‌లో పేర్ల నమోదుకు అర్హులని తెలిపారు. ఈఎస్ఐ, ఈపిఎఫ్, సభ్యత్వం లేని వారు ఈ పథకంలో చేరేందుకు కామన్ సర్వీస్ సెంటర్ గ్రామ వార్డు సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, ఆధార్ లింక్ మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా నెంబరుతో కూడిన వివరాలను నమోదు సెంటర్‌కు తీసుకువెళ్లాలన్నారు. ఈశ్రమ్ పోర్టల్ నమోదు ద్వారా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు పొందుతారని అన్నారు. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.రెండు లక్షలు, పూర్తి అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల వలస కార్మికులు నివాసం ఉన్నచోటే ఎన్ఎఫ్ఎస్ఎ ద్వారా రేషన్ పొందటానికి అవకాశం కల్పిస్తారన్నారు. వివరాలకు సిఎస్‌సి జిల్లా మేనేజరు, బాపట్ల సెల్ నెంబరు 9701831857, కార్మిక శాఖ హెల్ప్ డెస్క్ 9550444380, 800332866 నెంబర్ల ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు.

కోటప్పకొండ వరకు బైకు ర్యాలీ

ప్రజాశక్తి-పర్చూరు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కోసం పర్చూరులో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్చూరు నుంచి కోటప్పకొండ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. తొలుత పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లా బొల్లిబాబు, కోడూరి శేషబ్రహ్మాచారి, ఏవి కృష్ణ, బాషా, శ్రీరాం వెంకటసుబ్బారావు, కొల్లా చంద్రం, కె శివనాగేశ్వరరావు, కారుమంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం



సమావేశానికి హాజరైన సభ్యులు

నవంబర్ 14 బాల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరపటానికి సమావేశం నిర్వహించారు. గొల్లపూడి రాధాకృష్ణయ్య హాస్టల్‌లో ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. 11వ తేదీన బిబిహెచ్ జూనియర్ కళాశాలలో పద్య లిఖిత క్విజ్ పోటీలు, సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరపటానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ కిలారు లక్ష్మీ తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారిచే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోల్ల శ్రీరామమూర్తి, ఆవుల పున్నయ్య సత్రం మల్లేశ్వరరావు, గొల్లపూడి సీతారాం, గౌరబత్తుని రవిబాబు, కోడూరి ఏకాబంరేశ్వరబాబు, కుమారి, కొసనం నాగమాంబ, ప్రయాగ, అందే ప్రసాద్, రామిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-చీరాల

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టు దుర్మార్గం అని త్వరలోనే వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని నియోజకవర్గం ఇంచార్జి ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం పట్టణం లోని 9వ వార్డులో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆధారాలు చూపకుండా న్యాయాన్ని దాటవేస్తూ చంద్రబాబు మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని, తప్పుడు వైద్యాన్ని అందించి వారిని ప్రజా జీవన స్రవంతిలోకి రానీయకుండా చేయాలని పన్నాగం పన్నుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం,



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎం ఎం కొండయ్య

బాపట్ల బీసీ సెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధన్, ఉసురుపాటి సురేష్, మొహిద్దిన్, పళగర్ల బాలసుబ్రమణ్యం, అనపర్తి రత్నబాబు, కొండూరు రత్నబాబు, రాజేశ్వరి, ఆనంద్, రోశయ్య, ధరిశా, సాంబశివరావు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు పున్నయ్యకు నివాళి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతార్లంక పున్నయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు పూలమాల వేసిన నివాళి అర్పించారు. అన్నయ్య కుమారుడు పోతర్లంక రాజేష్ బాపట్ల జిల్లా పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువజన విభాగం అధ్యక్షులుగా



పున్నయ్యకు నివాళి..

పనిచేస్తున్నారు. పున్నయ్య మృతి పార్టీకి తీరని లోటని శంకర్రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, నియోజకవర్గ టిడిపి నాయకులు, బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

ప్రజశక్తి-చీరాల

విద్యార్థులు ఇష్టంగా చదవాలని గ్రంథ పాలకురాలు డి ధనమ్మ అన్నారు. స్థానిక చీరాల గ్రంథాలయంలో విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో వారికి గ్రంథాలయంలో చదవటం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించి వారితో కథల పుస్తకాలు చదివించి మరల వాటిని వారితో చెప్పించుకున్నారు. విద్యార్థులకు అవసరమైన ఆటలు, పాటలు కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను సెలవల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో నగరోత్సవం చేస్తున్న మహిళలు

వాడరేవు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-చీరాల

చీరాల వాడరేవులోని అతిథి గృహానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌లు గెస్ట్ హౌస్‌కు చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

108 కలశాలతో నగరోత్సవం

ప్రజాశక్తి-చీరాల

ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహెూత్సవాలు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సంత బజార్‌లో నూట ఎనిమిది కలశాలతో అమ్మవారి నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు 108 కళాశాలతో చీరాల పురవీధులలో ఊరేగింపుగా నగరోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమతో ఘనంగా అభిషేకించారు. ఈ సందర్భంగా గుడి కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఈరోజు కలశాలతో మహిళలు పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఈ నగరోత్సవంలో అధిక సంఖ్యలలో మహిళలు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారని వారు తెలిపారు. కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

శ్రీచక్ర సరిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కోట శ్రీనివాస్ కుమార్ ఆదివారం అద్దంకిలో వేంచేసి ఉన్న గుండికానిది నుంచి 108 కలశాలతో 300మంది మహిళలతో ఊరేగింపుగా అమ్మవారి గుడిలో కలశ స్థాపన చేశారు పాత ఊటుకూరు సుబ్బరామయ్య అండ్ బ్రదర్స్ 52 శరన్నవరాత్రులు సందర్భంగా 52 కిలోల లడ్డుని ఊరేగింపుగా అమ్మవారి గుడికి తీసుకువచ్చారు ఈ లడ్డూకు ఈ తొమ్మిది రోజులు పూజలు జరుగుతాయని తెలిపారు.

నేడు ఇంకొల్లు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బండారు అనూష అధ్యక్షతన సోమవారం జరుగుతుందని ఎంపిడిఒ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమావేశం జరుగుతుందని అన్నారు. మండలంలోని మండల పరిషత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని రాజ్యలక్ష్మి కోరారు.

నేడు రోటరీ గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి-వేటపాలెం

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ భూసిరెడ్డి శంకర్‌రెడ్డి సోమవారం ఉదయం వేటపాలెం రోటరీ క్లబ్‌ను సందర్శిస్తారని అధ్యక్షులు బట్ట మోహన్‌రావు తెలిపారు. రోటరీ సీనియర్ సభ్యులు కారంచేటి శివరామకృష్ణ ఇంటి వద్ద అల్పాహార విందులో పాల్గొంటారన్నారు. అనంతరం వేటపాలెం సారస్వత నికేతన్ గ్రంథాలయాన్ని సందర్శిస్తారు. అనంతరం జీడిపప్పు కర్మాగారాన్ని పరిశీలిస్తారు. తదనంతరం వేటపాలెం రోటరీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు పలకల పంపిణీ, ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థి పన్నెం కిరణ్‌మయికి ఆర్థిక సాయం అందిస్తారు. కాబట్టి రోటరీ సభ్యులు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

'చదవటం మాకిష్టం' ప్రారంభం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం ఇడుపులపాడు శాఖ గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమాలను ఆదివారం నుంచి ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ వరకు పిల్లలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకురాలు ఎ శకుంతల తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు చెప్పటం, చదివించటం లాంటి కార్యక్రమాలు జరుపుతున్నామన్నారు. విద్యార్థులంతా దసరా శెలవుల్లో ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని శకుంతల కోరారు.

రాయితీపై పంపిణీకి శనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-అద్దంకి

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. జెజి 11 రకం 40 శాతం రాయితీ పోను క్వింటాల్ 4,860 రూపాయలు చెల్లించాలని కాక్ 2 రకం క్వింటాల్ 8,430 రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఒక్కొక్క రైతుకు గరిష్ఠ పరిమితి 5 ఎకరాలకు విత్తనాలు ఇస్తున్నామని, ఎకరాకు 40 కేజీల చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రం వద్ద సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇంకొల్లు: ఇంకొల్లు మండల పరిధిలోని రైతులకు రాయితీపై శనగల పంపిణీ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి పి ఆదినారాయణ తెలిపారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 40 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సేకరించిన ఈ శనగలు. కాగ్ 2 తెల్ల రకం క్వింటాలు 14 వేల 30 రూపాయలు కాగా రాయితీ పోను 8,360 రూపాయలకు జై జై 11 రకం ఎర్ర శనగలు క్వింటాలు 8,100 చొప్పున 40 శాతం రాయితీ పోను 4,360 రూపాయలకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'మంగళకరము' గురించి ప్రచారం చేయండి

ప్రజాశక్తి-పంగులూరు

చేతులు లేని వారికి కృత్రిమ చేతులు ఉచితంగా అందజేసే "మంగళకరము" ప్రాజెక్టు గురించి ప్రజల్లో విస్తారంగా ప్రచారం చేయాలని, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందే రేవంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్షులు కరణం హనుమంతరావుకు రేవంత్ లేఖ రాశారు. ఎల్ఎన్ 4 కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేయడానికి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి క్లబ్బు మంగళకరము పేరిట చేపట్టిన సర్వీస్ ప్రాజెక్టు గురించి ఆ లేఖలో పేర్కొన్నారు. చేతులు లేని దివ్యాంగులకు ఈ సమాచారం చేరటం ఎంతో అవసరమని, అందుకోసం విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు ప్రమోషనల్ వీడియోలను వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. క్లబ్ సభ్యులందరినీ ప్రోత్సహించి, దివ్యాంగుల సహాయార్థం రోటరీ చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమానికి తోడ్పడాలని కోరారు.

సంకెళ్లతో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఆదివారం 'న్యాయానికి సంకెళ్లు' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాపట్లలో పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాతా జయప్రకాష్ నారాయణ, ముక్కామల శివ, శంకరరెడ్డి, పాల్గొన్నారు.

భట్టిప్రోలు: టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లతో సంకెళ్లతో చేతులు కట్టుకొని.. న్యాయానికి సంకెళ్లు అనే నినాదంతో స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

చెరుకుపల్లి: స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యకర్తలు చేతులకు సంకెళ్లు వేసుకొని తమ నిరసన తెలియజేశారు.



బాపట్లలో చేతికి సంకెళ్లతో నిరసన

కారంచేడు: తెలుగుదేశం కార్యకర్తలు చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్యచౌదరి పాల్గొన్నారు.

కొండపి: కొండపి గాందీబొమ్మ సెంటర్‌లో టిడిపి నాయకులు చేతులకు సంకెళ్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

నేడు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు, విద్యుత్ భారాలను రద్దు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఆయా పార్టీల నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఒంగోలు సిపిఐ ఆఫీసు నుంచి ఉదయం పది గంటలకు కలెక్టరేట్ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం 10.30కు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు.

పకడ్బందీగా ఎఫ్‌ఎల్‌సి ప్రక్రియ

- నేటి నుంచి నవంబర్ 10 వరకు కార్యక్రమ నిర్వహణ - ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి స్థానిక మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములలో బందోబస్తు, వెబ్ కాస్టింగ్ రిలే ఏర్పాట్లను ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ ప్రాంగణం మొత్తం కలియతిరిగి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16 తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఎఫ్ఎల్‌సి నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ నియమించిన సాంకేతిక నిపుణులు వస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఎఫ్ఎల్‌సి ఉంటుందన్నారు. ఈవిఎంలలో సాంకేతికంగా ఎలక్ట్రానిక్ లోపాలు ఏమైనా ఉంటే ఈ సందర్భంగా నిపుణులు పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. మొత్తం ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లా రెవెన్యూ అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సి నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలకు లేఖలు రాశామని తెలిపారు. రాజకీయ పార్టీల తరపున వచ్చే ప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్నీ సిసి కెమెరాల ద్వారా రికార్డు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య ఎన్నికల అధికారి, తనతో పాటు జిల్లా ఎస్పీ కూడా ఈ ప్రక్రియను లైవ్ వెబ్ కాస్టింగ్‌లో చూసేలా ఏర్పాటు చేశామన్నారు. ఈవిఎం గోదాముల ప్రాంగణంలోకి రాకపోకలను నియంత్రించేలా గట్టి భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం గుర్తింపు కార్డు ఉన్న వారినే ఈ ప్రాంగణంలోకి అనుమతిస్తామన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ ప్రాంగణంలోకి అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన భోజన, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

గట్టి భద్రతా ఏర్పాట్లు

ఈవిఎం గోదాముల ప్రాంగణంలో ఆర్మ్, సాధారణ పోలీసులతో గట్టి భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి మలికా గర్గ్ తెలిపారు. విధుల నిర్వహణ కోసం ప్రాంగణంలోకి మహిళలు ప్రవేశించేటప్పుడు తనిఖీ చేయడానికి మహిళా పోలీసులను కూడా నియమించామన్నారు. రెగ్యులర్‌గా ఈవిఎం గోదాము వద్ద సెక్యూరిటీ సిబ్బంది గట్టి భద్రత కల్పిస్తున్నారని, ఎఫ్ఎల్‌సి దష్ట్యా బయట నుంచి ఎక్కువమంది వచ్చే అవకాశం ఉండటంతో భద్రతాపరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా సెక్యూరిటీని పెంచినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల రాకపోకల సమయంలో పోలీసులు నిర్వహించాల్సిన విధులు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వీరి వెంట డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, ఏఎస్‌పి అశోక్ బాబు, ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి, ఎస్‌బి డిఎస్‌పి మరియదాసు, కలెక్టరేట్ ఏఒ చిరంజీవి, కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తే కఠినచర్యలు

- రూ.452 కోట్ల లక్ష్య సాధనకు కృషి
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాలకు ప్రతిపాదనలు
- ప్రతి వారం సబ్ కార్యాలయాల తనిఖీ
- జిల్లా రిజిస్ట్రార్, రిజిస్ట్రార్ కార్యాలయ తనిఖీ అధికారి ఉపేంద్రరావు



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నకిలీ, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రిజిస్ట్రార్, రిజిస్ట్రార్ కార్యాలయ తనిఖీ అధికారి టి.ఉపేంద్రరావు తెలిపారు. జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.452 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని, సాధించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని భవనాలు లేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలలో భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రతి వారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించి ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ తెలియజేశారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ లక్ష్యాలను జిల్లా రిజిస్ట్రార్ 'ప్రజాశక్తి'కి వివరించారు.

జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒంగోలు, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, పొదిలి, దర్శి, చీమకుర్తి, సంతనూతలపాడు, అమ్మనబ్రోలు, సింగరాయకొండ ఉన్నాయి. భూముల క్రయ, విక్రయాలు, స్టాంపులు అమ్మకం వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈసిలు తీయటం, చలానాలు కట్టించుకోవటం వంటి విధులలో ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలోనే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి వీలు కల్పిస్తూ ఇటీవల కాలంలో గ్రామ / వార్డు సచివాలయాలకు అనుమతి ఇచ్చింది. ప్రజలు ఆయా గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే పత్రాలను అప్‌లోడ్ చేసి సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపిస్తారు. సబ్ రిజిస్ట్రార్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇస్తూ సచివాలయాలకు పంపుతారు. తరువాత సచివాలయాలలో రిజిస్ట్రేషన్ పూర్తయిన కాగితాలు తీసుకోవచ్చు.

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తే..

ఇటీవల కాలంలో భూముల విలువలు పెరగటంతో నకిలీ, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించటానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. నకిలీ, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తే రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలు సెక్షన్ 82, 83 ప్రకారం ప్రాసిక్యూషన్ చేసి కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతోంది. ప్రజలు భూములు, ఆస్తులు కొనుగోలు చేసే సమయంలో ఆ సర్వే నెంబర్‌పై సర్వే చేయించాలి. తప్పుడు సర్వే నెంబర్లు ఇచ్చారేమో చూసుకోవాలి. పాత రికార్డులు, ఈసీ చెక్ చేసుకోవాలి. పెద్ద మొత్తంలో భూములు ఆస్తులు కొనుగోలు చేసేటప్పుడు పత్రికా ప్రకటన ఇచ్చి ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని కోరాలి. తరువాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఒంగోలు మండలం, ముక్తినూతలపాడు 186/1లో రిజిస్ట్రేషన్ భూములకు డికె పట్టాలు సృష్టించి.. కొన్ని రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ విషయమై దృష్టి సారించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చాం.

రూ.452 కోట్ల లక్ష్య సాధనకు కృషి

జిల్లాలో భూముల క్రయ, విక్రయాల ద్వారా ప్రభుత్వం రూ.452 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. 2023 జూన్ 1వ తేదీ నుంచి భూముల విలువ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారం కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పడ్డాయి. స్ట్రక్చర్ లేఅవుట్, ఆర్‌సిసి, అపార్ట్‌మెంట్, మున్సిపల్‌ర, పంచాయతీలలోని భూములకు ధరలు నిర్ణయించారు. ఆ ప్రకారం వినియోగదారుల వద్ద రిజిస్ట్రేషన్ ఛార్జీలు తీసుకోవటం జరుగుతోంది. ఏవైనా స్థలాలు లీజుకి తీసుకునే సమయంలో చేసుకునే ఒప్పందాలను రిజిస్ట్రేషన్ చేసుకోవటం మంచిది. ఇది చట్టబద్ధమైనంది. ఏమైనా సమస్యలు వచ్చి కోర్టుకెళ్లినప్పుడు ఇది ఉపయోగపడుతోంది.

కార్యాలయ నిర్మాణాలకు ప్రతిపాదనలు

జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని సబ్ రిజిస్ట్రార్, డిఆర్ కార్యాలయాలు సైతం అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. ఒంగోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గతంలో 20 సెంట్ల భూమి కేటాయించారు. భవన నిర్మాణం జరగలేదు. అదేవిధంగా అమ్మనబ్రోలులో స్థలం కేటాయించింది. మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తనిఖీ

ప్రతి వారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నా. అక్కడ ఏమైనా ప్రజా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. భూముల రిజిస్ట్రేషన్ల పారదర్శకంగా చేయాలనే ప్రభుత్వం ఉద్దేశ్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం.

రజక వృత్తిదారులకు

ఉచిత విద్యుత్ అమలుచేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆదివారం ప్రకాశం జిల్లా రజక వత్తిదారుల ఆరో మహాసభలు దేవారంపాటి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు రజకులతో భర్తీ చేయాలన్నారు. అనంతర జిఎంపిఎస్ రాష్ట్ర నాయకులు తోట తిరుపతరావు మాట్లాడారు. పొదిలి గోపి హంతకులను తేల్చి కుటుంబానికి న్యాయం చేయాలని తీర్మానించారు. అనంతరం జిల్లా కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా టంగుటూరి రాము, ప్రధాన కార్యదర్శిగా రాయల మాలకొండయ్య, ఉపాధ్యక్షులుగా రమణమ్మ, కోటేశ్వరరావు, కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మంచి కలపాటి శ్రీనివాసరావు, సిహెచ్ కొండయ్య మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న భాస్కరయ్య



మాలకొండయ్య, రాము